
# అమ్మ

నందం రామారావు



డాక్టర్ సాగర్ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు.

"ఇది నిజమేనా" అనుకుంటూ మరోసారి తన ముందున్న రిపోర్ట్‌ని తీసి చదివాడు.

ఆ రిపోర్ట్‌ని బట్టి తన తండ్రికి పిల్లలు పుట్టే అవకాశమే లేదు! అయితే, మరి తనెలా?.... ఆలోచనలతో అతని తలలోని నరాలు చిట్లిపోయాన్పించింది. ఎడమచేతితో కణతల్ని గట్టిగా నొక్కుకున్నాడు.

అతని అవస్థను గమనిస్తున్న డాక్టర్ భానుమూర్తి, సాగర్ దగ్గరకు వచ్చి భుజం మీద చేయివేసి -

"మిస్టర్ సాగర్! నువ్వీవిషయాన్ని సీరియస్‌గా తీసుకోకూడదు. సైన్స్ ఎన్నో అద్భుతాలను సృష్టిస్తోంది. మనలాటి డాక్టర్లు కూడా నమ్మలేని ఎన్నో వింతలు ఈ లోకంలో జరుగుతున్నాయి. మనిషి కంటే ప్రకృతి ఎన్నోరెట్లు గొప్పది. ఐనా, సాగర్! ఇది పాతికేళ్ళ నాటి విషయం" అన్నాడు.

"కావచ్చు డాక్టర్! కానీ, ఇది నా స్వవిషయం. అందుకే నాకింత బాధ".

"సాగర్! అది నిజం కాదని చెబుతున్నాను. మీ నాన్న, నేనూ స్నేహితులం. మీ నాన్న ఓ రోజు నా దగ్గరకొచ్చి సిగ్గుపడుతూ-

"భానుమూర్తీ! నువ్వు పరీక్షించాలి. ఇంకో డాక్టర్ దగ్గరికి వెళ్ళలేను. స్నేహితుడివి కాబట్టి నీ దగ్గరకొచ్చాను. మా ఆవిడను లేడి డాక్టర్ పరీక్ష చేసి, ఆవిడకు ఏ లోపం లేదని చెప్పింది. నువ్వు కూడా నన్ను పరీక్ష చేశావంటే నాకు తృప్తి" అన్నాడు. నేను పరీక్ష చేశాను. మీ నాన్నకి పిల్లలు పుట్టే అవకాశం లేదు. ఆ విషయం మీ నాన్నతో చెప్పడానికి బాధపడి అబద్ధం చెప్పాను. మీ నాన్న ఎంతో సంతోషిస్తూ వెళ్ళిపోయాడు. నిజం దాచినందుకు నేను చాలా విచారించాను. ఏదో ఒక రోజు నిజం చెప్పాలనుకున్నాను.

ఇంతలో నేను అమెరికా వెళ్ళిపోయాను. మరో రెండేళ్ళకు నువ్వు పుట్టినట్టు మీ నాన్న ఉత్తరం రాశాడు. ఇక, ఆ తర్వాత ఆ విషయమే నేను మర్చిపోయాను.

"నేనీ వూరొచ్చి ఇప్పటికి ఆరు నెలలయింది. నువ్వు డాక్టర్ వైనందుకు చాలా ఆనందించాను. రాత్రి ఎందుకో పాత ఫైళ్ళు తిరగేస్తుంటే ఆ రిపోర్ట్ కనబడింది. రాత్రంతా దాన్ని గురించే ఆలోచిస్తూ వుండడంతో, ఫైళ్ళ సంగతి మరచిపోయాను. ఉదయమే ఈ ఫైలు నీ కంటబడింది. నీ బలవంతం మీద ఈ నిజం చెప్పాల్సివచ్చింది. సాగర్! ఈ విషయాన్ని గురించి ఆలోచించకు. ఒక్కోసారి మనం అనుకోనివి జరుగుతూ వుంటాయి" అన్నాడు డాక్టర్ భానుమూర్తి ఎంతో అనునయంగా.

డాక్టర్ భానుమూర్తి తను అనవసరంగా చెప్పానని బాధపడ్డాడు. ఇది ఏ అనర్థాలకు దారి తీస్తుందోనని భయపడ్డాడు. సాగర్ కెదురుగా వుండలేక తలుపు తీసుకొని బయటికెళ్ళాడు కానీ, సాగర్ ఆ విషయాన్ని మర్చిపోలేదు. సీరియస్‌గానే తీసుకున్నాడు!

ఎన్ని విధాలుగా చూసినా తన తండ్రికి సంతాన యోగ్యతలేదు, కానీ, ఆ విషయం ఆయనకు తెలీదు! తను మాత్రం పుట్టాడు, ఎలా! ఇదెలా సాధ్యం?

కళ్ళు తెరచి చూశాడు సాగర్.

ఎదురుగా రాధాకృష్ణుల చిత్రం గోడకు వ్రేలాడుతూ కనిపించింది. రాధ కృష్ణుడి కౌగిలిలో పరవశిస్తోంది. ఆమెకళ్ళు అరమోడ్పులయాయి. శరీరం అలౌకికానందాన్ని అనుభవిస్తోంది. ఆ చిత్రం అంటే తనకెంతో ఇష్టం. అందుకే తెచ్చుకుని తన గదిలో తగిలించుకున్నాడు. కానీ, ఇప్పుడు ఆ రాధ స్థానంలో తన తల్లి, కృష్ణుడు స్థానంలో తన తండ్రి కాదు ఎవరో వున్నారు!

సాగర్ గుండెల్లో వెయ్యి తుఫానులు

చెలరేగాయి! "బాబూ! సాగర్! మీ అమ్మలాటి మంచి స్త్రీ నా భార్య కావటం నా అదృష్టం. నువ్వు కూడా మీ అమ్మకు నచ్చిన అమ్మాయినే చేసుకో, సుఖపడతావ్!" అంటూ తండ్రి అప్పుడప్పుడూ అనేవాడు.

ఆ మాటలు ఆ రోజుల్లో విని ఆనందించేవాడు. కానీ, ఈ రోజుల్లో గుండెల్లో మంటలు రేపుతున్నాయి.

"నాన్నా! నువ్వు కూడా మోసపోయావ్!" అనుకున్నాడు సాగర్ బాధగా.

ఇంతలో ఫోన్ మ్రోగింది.

సాగర్ రిసీవర్ తీసుకున్నాడు.

అవతల తల్లి గొంతు - "బాబూ సాగర్! రెండవుతోంది. ఇంకా భోజనానికి రాలేదే" తల్లి ఆప్యాయంగా అడిగింది.

సాగర్‌కి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది. వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. మళ్ళా తల్లే అంది - "బాబూ ఏదైనా కేసు గురించి ఆలోచిస్తున్నావా? ముందు ఇంటికొచ్చి భోజనం చేసి వెళ్ళు. మీ నాన్నగారు నీకోసం కనిపెట్టుకు కూర్చున్నారు."

ఆ రిపోర్ట్ చదివిన దగ్గరనుంచి సాగర్‌కి తండ్రిమీద విపరీతమైన ప్రేమ పెరిగిపోయింది. అందుకే, తల్లి అన్న చివరి మాటతో అతను చలించిపోయి వెంటనే కదిలాడు. "ఇప్పుడే వచ్చేస్తున్నా" అని ఫోన్ పెట్టేసి బయటకొచ్చాడు.


స్కూటర్ మీద పావుగంటలో ఇంటికొచ్చాడు. స్కూటర్ చప్పుడు విని తల్లి అనసూయ బయటకొచ్చి - "ఇవేళ ఇంత ఆలస్యమైందేవిటి బాబూ" అని ఆరాటంగా అడిగింది.

సాగర్ తలెత్తి తల్లి ముఖంలోకి చూడలేకపోయాడు. తల్లిని తప్పించుకుని గబగబా లోపలకెళ్ళాడు. డ్రెస్ మార్చుకుని డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చాడు. అప్పటికే తండ్రి రాజారావు కుర్చీలో కూర్చుని వున్నాడు.

"నాన్నా! మీరింతవరకు భోజనం చెయ్యలేదా! అసలే మీకు ఒంట్లో బాగుండటంలేదు. ఇంతవరకూ భోజనం చెయ్యకుండా వుండడం మంచిది కాదు" అన్నాడు- కుర్చీ జరుపుకుని కూర్చుంటూ సాగర్.

అనసూయ వడ్డించసాగింది.

ఇద్దరూ భోజనం చెయ్యసాగారు. ప్రతిరోజు భోజనం చేస్తూన్నప్పుడు తన హాస్పిటల్ విశేషాలు తల్లికి చెప్పడం సాగర్ అలవాటు. కానీ ఈ రోజు తలెత్తి తల్లివేపు చూడటమే అసహ్యమనిపిస్తోంది! ఎవరో తరుముకొస్తున్నట్టు గబగబా భోజనం చేసి వెళ్ళిపోయాడు సాగర్. కొడుకు ప్రవర్తన వింతగా వున్నా అనసూయ పెద్దగా పట్టించుకోలేదు.




సాగర్‌కి ఇంట్లో తల్లి ఎదురుగా వుండటం చాలా దుర్భరంగా వుంది. కళ్ళు మూసుకున్నా, తెరచినా అతనికి ఒకే ఒక్క విషయం మనస్సులో మెదిలి సంచలనం కలిగిస్తోంది!

తన తల్లి ఎవరివల్లనో తనని కన్నది. తన తండ్రికి అసలు విషయం తెలియకపోవడం వలన తనని తన స్వంత కొడుకుగానే భావిస్తున్నాడు. తనదెంతో హీనమైన బ్రతుకు. తన తండ్రి ఎవరో తెలీదు. తనింతకాలం రాజారావుని తండ్రిగానే భావిస్తూ వచ్చాడు. తనకీ విషయం తెలియకపోయినా బాగుండేది. ఇప్పుడు తనకి తెలిసింది కాబట్టి తండ్రికి చెప్పడం తన విధి.

ఇంకా ఆయన్ని తమ స్వంత కొడుకనే భ్రమలో వుంచడం క్షమించరాని నేరం!

వారం రోజులు గడిచాయి . సాగర్‌కి ఇంటికి రావడానికే దుర్భరంగా వుంది. తల్లిని 'అమ్మా' అని పిలవలేక పోతున్నాడు. ఇంటికి రాగానే గలగలా మాట్లాడే సాగర్ ఒక్కసారి మూగవాడిలా మారడం చూసి తల్లి కంగారు పడింది. చాలాసార్లు కారణమేమిటని సాగర్‌ని అడగడానికి ప్రయత్నించింది. కానీ, సాగర్, తల్లిని తప్పించుకుని తిరగసాగాడు.

ఉదయం ఏడుగంటలకి హాస్పిటల్‌కి వెళ్ళిపోయేవాడు. మధ్యాహ్నం భోజనం అక్కడికే తెప్పించుకునేవాడు. రాత్రి పదిగంటలు దాటిన తర్వాత ఇంటికొచ్చేవాడు.

ఒకటి రెండు సార్లు రాజారావు అడిగాడు.

"రిసెర్చ్ వర్క్ కొంత పూర్తి చెయ్యాల్సి వుందని, అంచేత, తన మనసు దాని మీదనే లగ్నం చేయాల్సి వుందని" సమాధానం చెప్పాడు. ఆ సమాధానం ఆయనకు తృప్తి కలిగించకపోయినా మాట్లాడలేదు. అనవసరంగా ఆయన ఎవర్నీ నొప్పించడు. కొడుకుని కూడా స్నేహితుడిలా చూడటం ఆయన అలవాటు!

ఓరోజు అనసూయ బాత్ రూమ్‌లో కాలు జారిపడింది. రాజారావు సాగర్‌కు విషయం చెప్పి వెంటనే హాస్పిటల్ నుంచి రమ్మన్నాడు. ఆ విషయం వినగానే బాధ కలిగినా ఎందుకో ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

"నేనిప్పుడు అర్జెంటు కేసు చూస్తూన్నాను. రావడానికి కుదరదు" అని ఫోన్ పెట్టేశాడు సాగర్.

కొడుకు సమాధానం రాజారావుకి ఆశ్చర్యం కలిగించింది. కర్తవ్యం గుర్తుకొచ్చి భార్యని వేరే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఆ రాత్రి తొమ్మిది దాటాక ఇంటికొచ్చాడు సాగర్. డ్రెస్ మార్చుకుని భోజనం చేసాడు. ఆ తర్వాత పైకి వెళ్ళి తన గదిలో పడుకున్నాడు. తల్లిని పరామర్శించలేదు. కనీసం తల్లికెలా వుందని తండ్రిని కూడా అడగలేదు.

మర్నాడుదయం మామూలుగా లేచి తన కార్యక్రమాలు పూర్తి చేసుకుని హాస్పిటల్ కెళ్ళిపోయాడు. కొడుకు ప్రవర్తన అనసూయకి, రాజారావుకి చాలా మనస్తాపం కలిగించింది. అనసూయ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏడవకు అనసూయ. అసలే నీ వంట్లో బావుండలేదు" అన్నాడు రాజారావు.

"మన బాబు మారిపోయాడండీ".

రాజారావు క్కూడా ఆ మాట నిజమేననిపించింది. కానీ, పైకి మాత్రం నవ్వేస్తూ "ఛ....... అదేం లేదు. ఏదో రిసెర్చ్ వర్క్ వుందని చెప్పాడుగా. బహుశా, దాని గురించే ఆలోచిస్తున్నాడేమో" అని మరి పింప చూశాడు.

“లేదండీ, వాడు మారిపోయాడు. బాబు నన్ను “అమ్మా” అని పిలిచి నెలరోజులయిందండి. వాడికి నామీద ఎందుకో చాలా కోపం వచ్చింది. కనీసం ఆ కారణం ఏపిటో తెలిసినా బాగుండును” అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

రాజారావు నిరుత్తరుడయ్యాడు.

“ఇంతకు ముందు, రోజూ ఉదయం, సాయంత్రం నా దగ్గర కూర్చుని హాస్పిటల్ కబుర్లు చెప్పేవాడు. ప్రతి పనికీ నన్నే పిలిచేవాడు. వాడు హాస్పిటల్‌కి వెళ్ళేవరకూ నేను వెంట వుండాల్సిందే. ఒక్కోసారి చిన్న పిల్లాడిలా నాచేత అన్నం తినిపించుకునేవాడు. తల దువ్వించుకునేవాడు. రాత్రి పూట కాస్సేపు నా ప్రక్కన కూర్చుని నా యోగక్షేమాలు అడిగేవాడు. అటువంటి నా బిడ్డ ఇప్పుడు నా నీడనే అసహ్యించుకుంటున్నాడు. నన్ను తప్పించుకు తిరుగుతున్నాడు. నేను వాడికేం ద్రోహం చేశానండి. కనీసం నా తప్పేమిటో చెప్పొచ్చు కదా” దుఃఖం ముంచుకురావడంతో మాట్లాడలేక ఆగిపోయింది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న భార్యని ఎలా ఓదార్చాలో ఆయనకు అర్థం కాలేదు. భార్య భుజం మీద చెయ్యివేసి - “అనసూయా! ఏడవకు విషయం నేను తెలుసుకుంటానుగా” అన్నాడు. అనసూయ మౌనంగా వుండిపోయింది.

ఆ రాత్రి సాగర్ భోజనం చేసి తన గదిలో కెళ్ళాడు. రాజారావు, కొడుకు వెనకాలే వెళ్ళి -

“సాగర్” అని పిలిచాడు.

“ఏమిటి నాన్నా” అనడిగాడు.

“నీతో కొద్దిగా మాట్లాడాలి”.

“కూర్చోండి నాన్నా” అంటూ కుర్చీ జరిపాడు.

“సాగర్! నువ్వు చదువుకున్నవాడివి. నీకిలా చెప్పాల్సి రావడం చాలా దురదృష్టం”.

“ఏవిటి నాన్నా”.

“సాగర్! ఈ ప్రపంచంలో అతి విలువైన వ్యక్తి తల్లి. వేదాల్లో కూడా ‘మాతృదేవోభవ” అని తల్లికే ప్రథమ స్థానం ఇచ్చారు. తన పిల్లల కోసం ప్రాణాల్ని సైతం వెచ్చించే తల్లి ఋణం ఎన్ని జన్మలెత్తినా తీరదు బాబు? తల్లి ప్రేమనూ ఆప్యాయతనూ పొందిన మనిషి జన్మ ధన్యమవుతుంది” అని ఆగాడాయన.

సాగర్ మౌనంగా వింటున్నాడు.

“సాగర్! మీ అమ్మ నీకోసం ఎంత శ్రమ పడిందో, నిన్ను ప్రాణంగా భావించి ఎంత అపురూపంగా పెంచిందో మాటల్లో చెప్పలేను. చిన్నప్పటి నుంచీ నీది అనారోగ్య శరీరం. నిద్రాహారాలు మాని నీకు సేవ చేసి తను అనారోగ్యం తెచ్చుకుంది. నువ్వు నవ్వితే పొంగిపోయేది. నువ్వు ‘అమ్మా’ అని పిలిస్తే సంబరపడేది. అటువంటి తల్లి లభించడం నీ పూర్వజన్మ సుకృతం.... “తండ్రి మాట పూర్తి కాకుండానే సాగర్ ‘నాన్నా’ అంటూ కొంచెం కోపంగా అరిచాడు.

“నాన్నా! నాది అదృష్టం కాదు. దురదృష్టం!” అన్నాడు.

రాజారావు తెల్లబోయాడు.

“నాన్నా! అమ్మ మీరనుకున్నంత మంచిది కాదు. ఆవిడ మనల్ని మోసం చేసింది.”

రాజారావు విస్తుపోయి చూశాడు.

“అవునాన్నా! ఆవిడను మీరెంతో ప్రేమించారు. ఆవిడ మీ అంత మంచి వ్యక్తిని మోసం చేసిన దుర్మార్గురాలు” అన్నాడు సాగర్.

కొడుకు అన్న మాటతో రాజారావుకి ఎక్కడ లేని కోపం వచ్చింది. సాగర్ చెంప చెళ్ళుమనిపించాడు.

“తలమీద పెట్టుకుని పూజించాల్సిన తల్లిని అనాల్సిన మాటేనా ఇది? అనసూయ నా ప్రాణం. ఆమె నొక్క మాటంటే నేను సహించను” అన్నాడు రాజారావు.

“నాన్నా! అసలు విషయం తెలిస్తే మీరు కూడా ఆ మాటే అంటారు” అంటూ లేచి డాక్టర్ భానుమూర్తి ఇచ్చిన రిపోర్టు చదివి వినిపించి - “నాన్నా! విన్నారు కదా! మీకు సంతానయోగం లేదు. అంటే అర్థమైందా? నేను మీ కొడుకుని కాను.... ఆవిడ ఎవరితోనో ....” అంటూ సాగర్ ఏదో అనబోయాడు. వెంటనే రాజారావు అడ్డుపడి-

“సాగర్! నాకు పిల్లలు పుట్టరనే విషయం నాకెప్పుడో తెలుసు. అనసూయకు అవకాశం వుంది. కొంతమంది డాక్టర్లు కృతిమ గర్భోత్పత్తికి సలహా ఇచ్చారు. అనసూయ అందుకు ఒప్పుకోలేదు. నేను అనసూయను మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నాను. ఆ మాట అన్నానని నాతో వారం రోజులు మాట్లాడడం మానేసింది. ఆరోజుల్లోనే అనసూయకు కడుపులో బల్ల పెరిగింది. అందరూ గర్భవతి అయిందనుకున్నారు. ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాను. మీ అమ్మను ఢిల్లీ తీసుకెళ్ళి ఆపరేషన్ చేయించాను. అక్కడే హాస్పిటల్లో అనుకోని సంఘటన ఒకటి జరిగింది. మా పక్క రూమ్‌లో వున్న స్త్రీ మూడు రోజుల పసికందుని వదిలేసి వెళ్ళిపోయింది. అందరూ కంగారుపడుతుంటే, అక్కడి హాస్పిటల్ సూపరెండెంట్ నాకు పరిచయస్తుడు కావడం వలన, ఆయన అనుమతితో మేము ఆపిల్లవాడిని పెంచుకోవడానికి తీసుకున్నాం. తిరిగి ఈ ఊరు వచ్చాం. మాకు పుట్టిన ‘బాబే’ అని అందరికీ చెప్పాం. అందరూ నమ్మేశారు. ఆ బాబే ఈ సాగర్. మీ అమ్మ కన్నకొడుకు కంటే ఎక్కువ ప్రేమతో నిన్ను పెంచి పెద్ద చేసింది. నువ్వు తన కొడుకువేనని మురిసిపోయేది. ఇప్పుడు చెప్పు సాగర్! నీ తల్లి చేసిన తప్పు ఏవిటి? పిల్లాడిని తీసుకొచ్చి పెంచుకోవడం తప్పా? ఏవిటి నీ తల్లి చేసిన తప్పు?” ఆవేశంగా అడిగాడు రాజారావు.

సాగర్‌కి ఈ ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది. రెండు పెద్ద మంచు దిమ్మల మధ్య శరీరాన్ని వుంచి నొక్కినట్లుగా అయిపోయాడు.

ఈ లోకంలో దొంగగా, అనాధగా రోడ్లమీద ఆడుకోవాల్సిన వాడిని తీసుకొచ్చి అందలం ఎక్కించారు. అక్రమ సంతానాన్ని ఎంతో ప్రేమతో పెంచారు. కానీ, తను.... తను... ఆ తల్లినే అనుమానించాడు. తనను కన్నతల్లికి తను అక్కర్లేకపోతే, తనని తీసుకొచ్చి, కన్న తల్లికంటే ఎక్కువ ప్రేమించి, పెంచిన అమ్మని, తను “అమ్మా” అని పిలవకుండా బాధపెట్టాడు. తనను పెంచిన తల్లే నిజమైన అమ్మ. సాగర్ గొంతులో నుండి చాలా రోజుల తర్వాత “అమ్మా” అన్న శబ్దం బయటకొచ్చింది!

పుట్టిన ప్రతిప్రాణి ఏడుపులోనూ, బాధలోనూ, దుఃఖంలోనూ, ఆనందంలోనూ అప్రయత్నంగా వచ్చే శబ్దం, ప్రాణమున్న ప్రతి జీవి చేసే ఆలాపన ‘అమ్మా’ అన్న పదం - ఆ ఇల్లంతా మారు మ్రోగింది! ❀

## ప్రీతీజింటా సంజయ్‌దత్‌ల ప్రేమాయణం



సొట్టబుగ్గల సుందరి ప్రీతీజింటా, సంజయ్‌దత్‌లమధ్య జరుగుతున్న ప్రేమాయణం గురించి బాలీవుడ్‌లో విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ప్రీతీజింటా అవి కేవలం విమర్శలు మాత్రమే వాటిలో నిజం లేదు అంటోంది. ఆ విమర్శలు వినిపించిన సమయంలో తాను విదేశాలలో ఉన్నానని అంటోంది. వారికి హీరోలతో ప్రేమాయణం సాగించడం అలవాటే కదా.